Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...

11వ వార్షికోత్సవం 2016 - 2026

మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శనివారం ఆగస్టు 08, 2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# రైతాంగం సుభిక్షంగా ఉండాలి

## 10న సీఎం వరుణయాగం



టీ మీడియా, ఆగస్టు 7 , హైదరాబాద్ బ్యూరో :
తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఈ నెల 10న వరుణ యాగం నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయ విహార్ ప్రాంగణం వేదికగా ఈ యాగం చేయనున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఖరారు చేసిన ముహూర్తం ప్రకారం యాగ క్రతువులు నిర్వహించనున్నారు.

**పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి**

10న సాయంత్రం జరిగే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని యాదాద్రి ధర్మకర్తల మండలి ఛైర్మన్ మన్నె సత్య నారాయణ రెడ్డి (ఎంఎస్?ఎన్? రెడ్డి) తెలిపారు. కృష్ణ, గోదావరి నదులు, రిజర్వాయర్లు, చెరువులు జలకళ సంతరించుకోవాలని, పాడి పంటలు బాగా పండాలనే సంకల్పంతో సీఎం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

**దాదాపు 22 లక్షల ఎకరాల ఆయకట్టు**

ఆగస్టు 10న సాయంత్రం 3:20 నుంచి 3:24 నిమిషాల మధ్య పూర్ణాహుతి కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరు కానున్నారు. 108 మంది రుత్వికులు, 11 హోమగుండాలు, వేద పండితులు, అర్చక బృందం ఈ యాగంలో పాల్గొంటారని దేవాదాయ శాఖ తెలిపింది.
రాష్ట్రంలో పాడిపంటలు (మిగతా 2లో)

# నాసిరకంగా ‘విద్యామిత్ర’ కిట్లు

- వారానికే పాడైపోయిన స్కూల్ బ్యాగులు



టీ మీడియా, ఆగస్టు 7 , అమరావతి బ్యూరో :
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల చదువుకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం “డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు” అందిస్తోంది. అయితే ఈ కిట్టులో నాణ్యత లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల కోసం అందజేస్తున్న ఈ కిట్లలోని స్కూలు బ్యాగులు అత్యంత నాసిరకంగా ఉండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బ్యాగులు చేతికందిన వారం రోజులు కూడా కాకముందే చిరిగిపోతున్నాయి. అంతేగాక తక్కువ బరువుకే తెగిపోతున్నాయి.

**జాప్యంతో పాటు నాణ్యత తీసికట్టు**

ఈ ఏడాది పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల మెటీరియల్ కొరత ఏర్పడి, రాష్ట్రవ్యాప్తంగా బ్యాగుల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగింది. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు సకాలంలో వీటిని సరఫరా చేయలేక చేతులెత్తేశారు. ప్రస్తుతం పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతుండటంతో విడతలవారీగా పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు.
ఈ విద్యామిత్ర కిట్టులో పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీతో పాటు 3 జతల ఏకరూప దుస్తులు, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు ఉంటాయి. అయితే అన్ని వస్తువులు ఉన్నా, వాటన్నింటినీ మోసే బ్యాగుల పరిస్థితి మాత్రం దారుణంగా మారింది. తక్కువ బరువుకే జిప్పులు ఊడిపోవడం, భుజాలకు తగిలించుకునే బెల్టులు తెగిపోతుండటంతో విద్యార్థులు లబోదిబోమంటున్నారు.

**700 బ్యాగులు వెనక్కి**

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలంలోని దాదాపు ప్రతి పాఠశాలలోనూ ఇదే పరిస్థితి దర్శనమిస్తోంది. కొత్త బ్యాగుల నుంచి దారాల పోగులు (పీచులు) ఊడి వస్తుండటం, కుట్లు ఊడిపోతుండటంతో నాణ్యత ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. పాఠశాలలకు బ్యాగులు అందిన రోజే ఈ లోపాలు బట్టబయలు కావడంతో, పాయకరావుపేట మండలం (మిగతా 2లో)

# అన్ని ప్రైవేటు స్కూల్స్ ఫీజుల వివరాలను డిస్‌ప్లే చేయాల్సిందే

- పాఠశాల విద్యాశాఖ ఆదేశం




టీ మీడియా, ఆగస్టు 7 , హైదరాబాద్ బ్యూరో :
తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల వ్యవహారంలో పారదర్శకత తీసుకురావడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తరగతి వారీ ఫీజుల వివరాలను ప్రతి ప్రైవేట్ పాఠశాల నోటీసు బోర్డు, పాఠశాల వెబ్‌సైట్‌తో పాటు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పోర్టల్లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

**ఫీజుల వివరాలు డిస్?ప్లే చేయని వారిపై చర్యలు**

ఫీజులను ఎలా నిర్ణయించారు అనే అంశాలకు సంబంధించి పాఠశాల గవర్నింగ్?బాడీ సభ్యుల సంతకాలతో కూడిన డాక్యుమెంట్లను కూడా పోర్టల్‌లో పొందుపరచాలని స్పష్టం చేసింది. ఫీజు వివరాలను డిస్‌ప్లే చేయని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు (మిగతా 2లో)

# శిక్ష విధిస్తే జీవితకాలం జైలులోనే




- సందీప్ సుల్తానియాపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

టీ మీడియా, ఆగస్టు 7 , హైదరాబాద్ బ్యూరో :
కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణకు హాజరైన ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ కుమార్ సుల్తానియాపై ఎన్నో కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, శిక్ష విధిస్తే జీవితకాలం జైలులోనే ఉండాల్సి వస్తుందని జస్టిస్ నగేశ్? భీమపాక సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తప్పుల వల్ల ఉన్నతాధికారులు కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు.

**చట్టప్రకారమే ముందుకు**

ఉచితాల వల్ల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుందని అనర్హులు సైతం లబ్ధిపొందుతుండటం వల్ల పథకాల లక్ష్యం నెరవేరడంలేదని హైకోర్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. రైతు బంధు పథకంలో కోటీశ్వరులు సైతం లాభపడుతున్నారని దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రభుత్వ వ్యవహారం వల్ల అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తోందని కోర్టు ధిక్కరణ పిటిషన్లలో అధికారులను న్యాయస్థానాలకు పిలిపించడం తమకూ ఇష్టం లేదని కానీ చట్టప్రకారం ముందుకు వెళ్లాల్సి ఉంటుందని జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. ప్రభుత్వ పథకాలు ఎప్పుడైనా నిజమైన అర్హులకు మాత్రమే అందాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎందరో అనర్హులు ఉచిత పథకాలు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**హైకోర్టు ఆదేశించినా అమలు కాలేదు**

కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్?పై హైకోర్టు విచారణ చేపట్టింది. ప్రభుత్వం బకాయిపడిన స్టాంప్ డ్యూటీ రూ.33 కోట్లు చెల్లించాలని ఆర్థిక శాఖను హైకోర్టు ఆదేశించినా అమలు కాలేదని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శికి వినతిపత్రం సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రామకృష్ణ కోర్టు ధిక్కరణ పిటిషన్?లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ పై (మిగతా 2లో)

# బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై ట్రంప్ ఆంక్షలు



- ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్ జారీ

టీ మీడియా, ఆగస్టు 7 , ఢిల్లీ బ్యూరో :
అమెరికాలో పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) పరిమితం చేయడానికి, ‘బర్త్ టూరిజం’ను అణచివేయడానికి ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకం చేశారు. గతంలో తీసుకువచ్చిన నిబంధన రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన కొద్ది వారాలకే ట్రంప్ ఈ తాజా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ కొత్త ఉత్తర్వుల ద్వారా విదేశీ దౌత్యవేత్తలు, పౌరసత్వాన్ని కొనుగోలు చేయాలనుకునేవారి పిల్లలకు అమెరికా పౌరసత్వం దక్కకుండా నిరోధించనున్నారు.

**బర్త్ టూరిజంను అడ్డుకోండి!**

కేవలం అమెరికా పౌరసత్వం కోసం గర్భవతులు టూరిస్ట్ వీసాపై అమెరికాకు (మిగతా 2లో)

# చేనేతకు 50 ఏళ్లకే పింఛన్

- ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు సాయం
- సీఎం చంద్రబాబు



టీ మీడియా, ఆగస్టు 7 , బాపట్ల :
చేనేతలను ఆదుకునేందుకే నేతన్నల నేస్తం పథకాన్ని తెచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు సాయం అందిస్తున్నామన్నారు. బాపట్ల జిల్లా కొత్తపేటలో ‘నేతన్న సేవలో’ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వకున్నా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. సబ్సిడీపై చేనేత కార్మికులకు విద్యుత్ ఇస్తామన్న సీఎం, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చీరాల కర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు ఎగుమతి దేశం గర్వించే కళ చేనేత కళ అని, మన రాష్ట్రం ఇలాంటి కళలకు నిలయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొత్తపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. మన నేత కార్మికులు అగ్గిపెట్టెలో పట్టే చీర తయారు చేశారని గుర్తు చేశారు. “చీరాల కర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు ఎగుమతి చేసేవారు. చీరాలను ఒకప్పుడు మినీ ముంబయి అనేవారు. అనేక చేనేత ఉత్పత్తులకు (మిగతా 3లో)

# థాయ్‌లాండ్ స్కూల్‌లో కాల్పులు

- ముగ్గురు విద్యార్థులు సహా ఆరుగురు మృతి
- నిందితుడు స్టూడెంటే!



టీ మీడియా, ఆగస్టు 7 , ఢిల్లీ బ్యూరో :
థాయ్‌లాండ్‌లో ఘోరం జరిగింది. బ్యాంకాక్ వెలుపల ఉన్న నొంతబురి ప్రావిన్స్‌లోని ఒక ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఒక విద్యార్థి విచక్షణరహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. మృతుల్లో ముగ్గురు ఉపాధ్యాయులు, ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. అలాగే ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఈ మేరకు రాయల్ థాయ్ పోలీసులు తెలిపారు.

**పోలీసులు ఏమన్నారంటే?**

దేశ రాజధాని బ్యాంకాక్‌కు వాయవ్యంగా ఉన్న నొంతబురి ప్రావిన్స్‌లోని డెబ్సిరిన్ నొంతబురి పాఠశాలలో ఈ కాల్పుల ఘటన జరిగిందని రాయల్ థాయ్ పోలీస్ ప్రతినిధి ట్రైరాంగ్ పివ్‌పాన్ తెలిపారు. దాడి అనంతరం నిందితుడు తనపై కాల్పులు జరుపుకొన్నాడని పేర్కొన్నారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించారని చెప్పారు. ఈ కాల్పుల్లో 15 మంది గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు.

**కాల్పులకు గల కారణాలు తెలియాల్సి ఉంది**

ఈ కాల్పులకు గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు జరుగుతోందని రాయల్ థాయ్ పోలీస్ ప్రతినిధి ట్రైరాంగ్ పివ్‌పాన్ చెప్పారు. కుటుంబ సభ్యుల్లో ఒకరి నుంచి నిందితుడు తుపాకీని తీసుకున్నట్లు భావిస్తున్నామని అన్నారు. స్కూల్‌లో కాల్పులు జరిపింది విద్యార్థేనని వెల్లడించారు. స్కూల్‌లో కాల్పులు జరిగిన సమాచారం అందుకోగానే పోలీసులు, అంబులెన్స్‌లు ఘటనాస్థలికి చేరుకున్నాయని వివరించారు. (మిగతా 4లో)

# నాసిరకంగా 'విద్యామిత్ర' కిట్లు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఏకంగా 700 నాసిరకం బ్యాగులను ఉపాధ్యాయులు, అధికారులు వెనక్కి పంపించేశారు. కొంతమంది విద్యార్థులు ఆ చిరిగిన బ్యాగులకే కుట్లు వేయించుకుని వాడుకుంటున్నారు.

అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యామిత్ర కిట్ల నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా నక్కపల్లి బాలికోన్నత పాఠశాల, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకిచ్చిన బ్యాగులు నెలరోజులకే జిప్పులు, హ్యాండిల్స్ చిరిగిపోతున్నాయి. కొందరు విద్యార్థులు ప్రత్యామ్నాయ బ్యాగులను తెచ్చుకుంటున్నారు. మరికొందరు వీటికి పిన్నీసులు పెట్టి, కుట్లు వేసి వాడుకుంటున్నారు. వీటి తీరు చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విస్తుపోతున్నారు. అనకాపల్లిలో విద్యార్థులకు అందజేసిన బ్యాగులు నెలరోజులకే రూపు మారిపోయాయి.

**వెనక్కి తీసుకుంటున్నాం**

1,396 ప్రభుత్వ పాఠశాలల్లో లక్షకు పైగా విద్యార్థుల కోసం సుమారు రూ.2,279 చొప్పున కిట్టు ఖర్చు చేసినా, నాసిరకం వస్తువులు అందాయని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లోపం ఉంటే వెనక్కి తీసుకుంటామని, పుస్తకాల బరువు వల్ల కూడా బ్యాగులు పాడవుతున్నాయని సమగ్ర శిక్షాభియాన్ ఏపీసీ శ్రీరాములు తెలిపారు.

# రైతాంగం సుభిక్షంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సమృద్ధిగా పండాలని, ఎల్ నినో ప్రభావం తొలగిపోయి ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇతర ప్రాజెక్టుల్లో నీరు చేరినప్పటికీ శ్రీశైలం నుంచి నీటి విడుదల కాకపోవడంతో నాగార్జునసాగర్ ప్రస్తుతం డెడ్ స్టోరేజ్‌లోనే ఉంది. శ్రీశైలం నిండటానికి మరో వారం రోజులు పట్టే అవకాశం కనిపిస్తుంది. సాగర్ కింద దాదాపు 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండటంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా నిర్వహిస్తున్న వరుణ యాగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## అన్ని ప్రైవేటు స్కూల్స్ ఫీజుల వివరాలను డిస్‌ప్లే చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

సూచించింది. దీంతో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల విషయంలో తల్లిదండ్రులకు స్పష్టత, పారదర్శకత పెరగుతుందని అభిప్రాయపడింది.

**ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దందా**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12,000 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చాలా స్కూళ్లు ఏటా ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచుతున్నాయని, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ఫీజులను కట్టలేక సామాన్యులు, మధ్యతరగతి వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఫీజులు పెంచాల్సి ఉన్నప్పటికీ కొన్ని ప్రైవేటు స్కూల్స్? మాత్రం భారీగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను కలవరానికి గురిచేస్తున్నాయి.

**ఈ ఫీజులను నియంత్రించేందుకు ఓ చట్టం**

తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం రెండేళ్ల క్రితమే నిర్ణయించింది. రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజు పెంపును ప్రతిపాదిస్తూ ఏడాదిన్నర క్రితమే డ్రాఫ్ట్? బిల్లును సిద్ధం చేశారు. ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించేందుకు ఈ ముసాయిదాను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరిలో ఆదేశించారు. కానీ అది ఇంకా కార్యరూపం దాల్చలేదు.

**నియంత్రణ కరవు**

ప్రైవేట్ స్కూల్‌ల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు అధికంగా నిర్ణయించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేర ఫీజులు వసూలు చేయాలి. గతంలో ప్రాథమిక తరగతులకు రూ.9వేలు, ఉన్నత తరగతులకు రూ.13 వేలకు ప్రభుత్వం నిర్ణయించగా ఆయా యాజమాన్యాలు కోర్టులను ఆశ్రయించాయి. దీంతో సదరు ఉత్తర్వులను నిలిపివేశారు. అప్పటినుంచి పాఠశాల మేనేజ్?మెంట్లే ఫీజులు నిర్ణయించుకునే వెలుసుబాటు కల్పించింది. ఫీజుల క్రమబద్ధీకరణకు కమిటీ లేకపోవడంతోనే ఈ సమస్యకు కారణమైంది.

**2027–28 నాటికి ఫీజు నియంత్రణ చట్టం**

సీఎం ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ అధికారులతో ఇటీవల ఫీజు నియంత్రణపై చర్చించి ప్రస్తుత ఫీజు వివరాలతో పాటు ఇతర సంబంధిత సమాచారాన్ని సేకరించాలని ఆదేశించినట్లు సమాచారం. అదేవిధంగా తరగతుల వారీగా ఫీజు వివరాలను కూడా ప్రదర్శించాలని ఆడిట్ నివేదికలను సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ముసాయిదా బిల్లుపై ప్రజల అభిప్రాయాలను సేకరించి మంత్రివర్గంలో చర్చించిన తర్వాత శాసనసభలో ప్రవేశపెట్టాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. మొత్తంమీద 2027–28 అకాడమిక్? ఇయర్? నాటికి ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# బర్త్‌రైట్ సిటీజన్‌షిప్‌పై ట్రంప్ ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి పిల్లలను కనడాన్ని బర్త్ టూరిజం అని అంటారు. ఇలాంటి వ్యాపార లావాదేవీల ద్వారా అమెరికాకు వచ్చే వారిని అడ్డుకోవడానికి ట్రంప్ తాజాగా ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అంతేకాదు ఇలాంటి బర్త్ టూరిజంను అడ్డుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే విదేశీ ప్రభుత్వాల కోసం లాబీయింగ్ చేసే వారి పిల్లలకు, ఉగ్రవాద సంస్థలకు చెందిన వారి పిల్లలకు, విదేశీ ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు ఇకపై పుట్టుకతో వచ్చే అమెరికా పౌరసత్వం లభించకుండా పరిమితి విధిస్తూ ట్రంప్ మరో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్? జారీ చేశారు.

ఇంతకు ముందు కూడా బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. అయితే అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే, వారిని అమెరికన్లుగానే పరిగణించాలని జూన్? 30న ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అమెరికాలో జన్మించిన దాదాపు అందరికీ పౌరసత్వం లభిస్తుందనే 100 ఏళ్ల క్రితం నాటి నిబంధనను సుప్రీంకోర్టు సమర్థించింది. దీనితో విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలనే ట్రంప్ ప్రయత్నం ఆ సమయంలో వీగిపోయింది. అయితే ట్రంప్ మళ్లీ కొత్త ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ఈ నిర్ణయంతో భారతీయులపై ప్రభావం పడే అవకాశం ఉండొచ్చు.

**జస్ట్ సర్దుబాటు చేయడం కోసమే!**

కొత్త ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకం చేసిన తర్వాత ఓవల్ ఆఫీస్?లో ట్రంప్ మాట్లాడారు. జూన్? 30న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. తాను కొత్తగా జారీ చేసిన ఉత్తర్వులు కేవలం కొన్ని సర్దుబాట్లు కోసమేనని స్పష్టం చేశారు. 'పుట్టుకతో లభించే పౌరసత్వంపై సుప్రీంకోర్టులో చాలా దురదృష్టకరమైన తీర్పు వెలువడింది. అందుకే మేము కొన్ని మార్పులు, సర్దుబాట్లు చేస్తున్నాం' అని అన్నారు. ఆ సమయంలో ఆయన పక్కనే వైట్ హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫెన్ మిల్లర్, కామర్స్ సెక్రటరీ హోవార్డ్ లుట్నిక్, యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమీసన్ గ్రీర్, వైట్ హౌస్ స్టాఫ్ సెక్రటరీ విల్ షార్ఫ్ ఉన్నారు.

**ఇంతకీ చట్టం ఏం చెబుతోంది?**

1868 జులై 9న ఆమోదించిన యూఎస్ రాజ్యాంగంలోని 14వ సవరణ, మాజీ బానిసలతో సహా అమెరికాలో జన్మించిన లేదా పౌరసత్వం పొందిన వ్యక్తులందరికీ పౌరసత్వాన్ని కల్పించింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో దీన్ని వ్యతిరేకిస్తున్న ట్రంప్?, "ఆ చట్టాన్ని అంతర్యుద్ధం (సివిల్ వార్) ముగిసిన తర్వాత చేశారు. అప్పట్లో బానిసల పిల్లల కోసం దీనిని తీసుకువచ్చారు. కానీ ఇప్పుడు ఏం జరుగుతోంది? ప్రజలు దీనితో వ్యాపారాలు చేస్తున్నారు" అని ట్రంప్ ఆరోపించారు.వాస్తవానికి అమెరికాలో వలస వ్యతిరేక విధానాల రూపశిల్పిగా భావించే మిల్లర్ మాట్లాడుతూ, "విదేశీయులు అమెరికాకు పర్యటకులుగా వచ్చినట్లు నటిస్తారు. కానీ వారి అసలు ఉద్దేశం ఇక్కడ బిడ్డకు జన్మనిచ్చి, ఆ బిడ్డకు ఆటోమేటిక్‌గా అమెరికా పౌరసత్వం లభించేలా చేస్తారు. ఈ విచ్ఛిన్నకరమైన వ్యవస్థ కారణంగా, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఉచితంగా లభిస్తున్నాయి.

# ఖమ్మం నడిబొడ్డున దర్జాగా కబ్జా



- నిబంధనలకు విరుద్ధంగా ఫంక్షన్ హాల్ నిర్వహణ
- ఇరిగేషన్ కాలువ మార్గాన్ని మూసివేత

**టీ మీడియా, ఆగస్టు 7, ఖమ్మం బ్యూరో:**

ఖమ్మం నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షిస్తూ రోడ్ల విస్తరణ, మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేస్తున్నారు. మరోవైపు నగరం నడిబొడ్డున భారీ కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మామిళ్లగూడెంలోని రవి స్వీట్స్ సమీపంలో ఉన్న ఇరిగేషన్ శాఖకు చెందిన గొల్లపాడు కాలువపై వేసిన స్లాబ్ ప్రాంతాన్ని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ ఫంక్షన్ హాల్ యజమాని కబ్జా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పోలీసు బారికేడ్ల తరహాలో అడ్డంకులు, ఆర్చిని ఏర్పాటు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

**కాలువను సొంత ఆస్తిగా మార్చిన తీరు**

నగరంలోని మురుగునీరు మున్నేరులో కలిసేందుకు మామిళ్లగూడెం మీదుగా ఇరిగేషన్ శాఖకు చెందిన కాలువ ఉంది. ఈ కాలువ నగర డ్రైనేజీ వ్యవస్థలో కీలకమైనది.రవి స్వీట్స్ పక్కన నగరానికి చెందిన ఓ ప్రముఖుడి స్థలం ఉంది. కోర్టు వివాదాలు, అనుమతుల సమస్యల కారణంగా గతంలో అధికారులు ఆ భవనాన్ని సీజ్ చేసినట్లు సమాచారం.

అయితే ఇటీవల అదే భవనంలో మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్నారు. ఈ క్రమంలో ఇరిగేషన్ కాలువ స్లాబ్‌పై ఆర్చిని ఏర్పాటు చేసి కాలువ మొత్తం తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలువ స్లాబ్‌ను ప్రజలు, వాహనాల పార్కింగ్ కోసం వినియోగించకుండా అడ్డుకుంటున్నారు.భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని పేర్కొంటూ పోలీసు బారికేడ్ల తరహాలో అడ్డంకులు ఏర్పాటు చేసి, "ఇటు రావద్దు" అంటూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

**కనీస సౌకర్యాలు లేవు**

ఈ ఫంక్షన్ హాల్‌కు ఉండాల్సిన కనీస సౌకర్యాలు కూడా లేవని ఆరోపణలు ఉన్నాయి. వాహనాల పార్కింగ్ స్థలం లేకపోవడం, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు లేకపోవడం, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు లేకపోవడం, మహిళలు––పురుషులకు వేర్వేరు మరుగుదొడ్లు లేకపోవడం, జీఎస్టీ నమోదు లేకపోవడం వంటి అంశాలు ప్రస్తావనకు వస్తున్నాయి.

**నిబంధనల ప్రకారం...**

ఫంక్షన్ హాల్ నిర్వహించాలంటే ఫైర్ శాఖ నుంచి ఎన్ఓసీ తప్పనిసరి. అలాగే దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, మహిళలు–పురుషులకు వేర్వేరు మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ స్థలం, సీసీ కెమెరాలు, వంటశాలకు ఫుడ్ సేఫ్టీ అనుమతులు ఉండాలి.అదనంగా భవన నిర్మాణ అనుమతులు, మ్యాపులు, సీటింగ్ సామర్థ్యం తదితర వివరాలతో మున్సిపల్ అధికారులకు దరఖాస్తు చేసి అనుమతి పొందాలి. అయితే ఇవేవీ లేకుండానే ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**టీ మీడియా ప్రతినిధికి బెదిరింపులు**

కాలువ స్లాబ్ స్థలం తనదేనంటూ ఫోటోలు తీస్తున్న టీ మీడియా ప్రతినిధిని నిర్వాహకుడు బెదిరించినట్లు సమాచారం. "ఫోటోలు తీస్తావా... ఇటు రమ్మంటే రావా... నేను ఎవరో తెలుసా? నీ ఇల్లు ఎక్కడో చెప్పు... మా వాళ్లు వచ్చి ఫోటోలు తీస్తారు... జాగ్రత్త..." అంటూ బహిరంగంగానే హెచ్చరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భవనంలో కుర్చీలో కూర్చొని సహచరులతో మాట్లాడుతూనే టీ మీడియా ప్రతినిధిని రమ్మని హుకుం జారీ చేశాడని, వెళ్లేందుకు నిరాకరించడంతో వీరంగం సృష్టించినట్లు చెబుతున్నారు.

**పలు ఆరోపణలు**

ఫంక్షన్ హాల్ నిర్వాహకుడిగా చెబుతున్న వ్యక్తి పలు ఆస్పత్రులకు నిర్వాహకుడిగా ఉన్నట్లు సమాచారం. నకిలీ వైద్య బిల్లుల ద్వారా సీఎంఆర్ఎఫ్‌తో పాటు ఇతర ప్రభుత్వ పథకాల నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గత 12 ఏళ్లుగా ఆయనకు చెందిన ఆస్పత్రులపై పలు అక్రమాల కేసులు నమోదై, విచారణలు కొనసాగుతున్నట్లు సమాచారం.అధికారంలో ఉన్న కొందరి అండతో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

(ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని వివరాలు తదుపరి కథనంలో...)



# ఈ రోజు ఆటో, క్యాబ్, లారీ, ఓలా, ర్యాపిడో, ఉబర్

- స్విగ్గీ, జొమాటో, జెప్టో, ఇన్‌స్టామార్ట్ అన్నీ బంద్

**టీ మీడియా, ఆగస్టు 7 , హైదరాబాద్ బ్యూరో :**

రేవంత్ సర్కార్‌ను మొద్దునిద్ర నుంచి తట్టిలేపడానికి తామంతా శనివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతున్నట్టు వాహన, డెలివరీ సంఘాల జేఏసీ ప్రకటించింది. వాహన సేవలు, యాప్ ఆధారిత డెలివరీ సేవలు నిలిపివేస్తామని జేఏసీ వెల్లడించింది. ఆటో, క్యాబ్, లారీ తదితర వాహన సేవలు, ఓలా, ర్యాపిడో, ఉబర్ ఆధారిత సేవలు, స్విగ్గీ, జొమాటో, జెప్టో, ఇన్‌స్టామార్ట్ తదితర డెలివరీ సేవలు అన్నీ బంద్ చేస్తామని జేఏసీ నేతలు తెలిపారు. నాంపల్లిలోని 'గిగ్' కార్యాలయంలో గురువారం 16 సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అన్ని సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటివరకు చాలాసార్లు తమ సమస్యలపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

**ముఖం చాటేసిన సీఎం రేవంత్‌రెడ్డి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదటి సమావేశం నాంపల్లి గ్రౌండ్‌లో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్‌తో ఏర్పాటు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ ఆధ్వర్యంలో వాహన సేవల యాప్ తీసుకొస్తామని మాటిచ్చి ఇప్పుడు ముఖం చాటేశారని వాహన సంఘాల జేఏసీ అధ్యక్షుడు షేక్ సలాఉద్దీన్, ఉపాధ్యక్షుడు, బీఆర్‌టీయూ నాయకుడు నగేశ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చి మూడేండ్లు అవుతున్నా 'గిగ్' కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం దారణమని మండిపడ్డారు. జూలై 22న నిర్వహించిన రాష్ట్రవ్యాప్త బ్రేక్‌డౌన్ ఫ్లాష్ సమ్మె సుమారు 3.3 లక్షల మంది పాల్గొన్నారని చెప్పారు. కార్మికులకు తగ్గుతున్న ఆదాయం, అన్యాయమైన చార్జీల విధానం, అల్గారిథమ్ ఆధారిత ఏకపక్ష నియంత్రణ, సామాజిక భద్రత లేకపోవడం వంటి తీవ్రమైన సమస్యలను ఎదురొంటున్నామని




వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ నిరవధిక సమ్మెలో తెలంగాణ యాప్ బేస్డ్ డ్రైవర్స్ ఫోరం, భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారం వర్కర్స్ యూనియన్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్, తెలంగాణ రాజ్య సమితి ట్రేడ్ యూనియన్, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఫెడరేషన్, ఇండియన్ లేబర్ వెల్ఫేర్ ఫెడరేషన్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్–బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ మైనారిటీస్ క్యాబ్ డ్రైవర్స్ అసోసియేషన్, తెలంగాణ ఫోర్ వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్ తదితర కార్మిక సంఘాలు, పౌర సమాజ సంస్థలు సమ్మెలో పాల్గొననున్నాయి.

**ప్రధాన డిమాండ్లు ఇవే..!**

యాప్ ఆధారిత రవాణా సేవలకు ప్రభుత్వం, ప్లాట్‌ఫారం కంపెనీలు కలిసి కనీస బేస్‌ఫేర్‌తోపాటు ప్రతి కిలోమీటరుకూ, ప్రతి నిమిషానికీ న్యాయమైన చార్జీలను నోటిఫై చేయాలి. తద్వారా యాప్ ఆధారిత డ్రైవర్లు, డెలివరీ వర్కర్లు, అన్ని గిగ్, ప్లాట్‌ఫారం కార్మికులకు స్థిరమైన ఆదాయం లభించేలా చూడాలి. తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫారం వర్కర్స్ రూల్స్‌ను వెంటనే నోటిఫై చేసి, వెల్ఫేర్ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలి. మోటర్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు– 2025ను పూర్తిగా అమలు చేసి, ప్రభుత్వం నిర్ణయించిన కనీస చార్జీలను నోటిఫై చేయాలి. మోటర్ వెహికల్స్ చట్టం–1988, మోటర్ వెహికల్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు– 2025 ప్రకారం కమర్షియల్ రిజిస్ట్రేషన్‌ను మార్చకుండా ప్రైవేట్ (నాన్–కమర్షియల్) ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలను యాప్ ఆధారిత ప్రయాణికుల లేదా సరుకు రవాణా సేవలకు ఉపయోగించడాన్ని నిషేధించాలి.

# శిక్ష విధిస్తే జీవితకాలం జైలులోనే

(మొదటి పేజీ తరువాయి)

కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలంటూ హైకోర్టు గత ఏప్రిల్ 7వ తేదీన ఆదేశించింది. జూన్ 18న ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన హైకోర్టు సందీప్ కుమార్ సుల్తానియా అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ జూలై 10వ తేదీకి విచారణ వాయిదా వేసింది. జూలై 10వ తేదీన కూడా సందీప్ కుమార్ సుల్తానియా హాజరు కాకపోవడంతో బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణ జరిగే రోజు సందీప్? కుమార్ సుల్తానియాను అరెస్ట్ చేసి హాజరుపర్చాలని హైదరాబాద్ సీపీని ఆదేశించింది.

**రూ.25 కోట్లను చెల్లించాం**

ఒకవేళ హాజరుకు సందీప్ కుమార్ సుల్తానియా తనే స్వయంగా వస్తానని హామీ ఇస్తే రూ.5 వేల వ్యక్తిగత పూచీకత్తు తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చిన సుల్తానియా ఈ రోజు న్యాయస్థానంలో విచారణకు హాజరయ్యారు. ఇప్పటికే రూ.25 కోట్లను కంటోన్మెంట్ బోర్డుకు విడుదల చేశామని మిగతా మొత్తం విడతల వారీగా విడుదల చెల్లిస్తామని కోర్టుకు తెలిపారు. అఫిడవిట్ దాఖలు చేయాలంటూ హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 19వ తేదీకి వాయిదా వేసింది.

# పి. మండల్ చేసిన సేవలు చిరస్మరణీయం

**⏭ మేకల మల్లిబాబు యాదవ్**

**టీ మీడియా, ఆగస్టు 7 కామేపల్లి:**
భారతదేశ చరిత్రలో ఓబీసీల అభ్యున్నతికి ఆగస్టు 7వ తేదీ ఒక సువర్ణాధ్యాయానికి నాంది పలికిందని, నాటి ప్రధాని వి.పి. సింగ్ హయాంలో 27 శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడానికి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బి.పి. మండల్) సుదీర్ఘ పోరాటమే ప్రధాన కారణమనిమేకల మల్లిబాబు యాదవ్ అన్నారు.మండల్ రిజర్వేషన్ డే (సామాజిక న్యాయ దినోత్సవం) పురస్కరించుకుని కామేపల్లి మండలం పండితాపురంలో బి.పి. మండల్ యాదవ్ చిత్రపటానికి మల్లిబాబు యాదవ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బి.పి. మండల్ తన జీవితాంతం పదవుల కోసం కాకుండా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమాన హక్కుల కోసం పోరాడారన్నారు. దేశమంతటా పర్యటించి 52 శాతానికి పైగా ఉన్న బీసీల స్థితిగతులను పరిశీలించి కేంద్రానికి చారిత్రాత్మక నివేదిక ఇచ్చారని గుర్తుచేశారు.



ముఖ్యమంత్రిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసినా నిత్యం బడుగు బలహీన వర్గాల పక్షానే నిలిచారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, కొమ్మినేపల్లి ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఓబీసీ నాయకుడు చల్ల మల్లయ్య, మండల కాంగ్రెస్ నాయకులు షేక్ రబ్బానీ పాషా, శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్, నాయకులు గుగులోతు రవి, జక్కంపూడి వెంకటేశ్వర్లు, బండి ఉపేందర్, ధరావత్ హరిచంద్ర, మేకల లక్ష్మీనారాయణ, భూక్య వీరన్న, బానోతు లక్ష్మ, దేరంగుల తిరపయ్య, రామారావు, తురక బిక్షం, చల్ల చిన్న మల్లయ్య, పగిడిపల్లి రాములు, మొగిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఇన్చార్జి లకు సన్మానం చేసిన బా జ పా నాయకులు

**టీ మీడియా, ఆగస్టు 07 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో భారతీయ జనతా పార్టీ నీ గ్రామీణ ప్రాంతాల్లో పటిష్ట పరిచేందుకై జిల్లా స్థాయి నాయకులను అన్ని మండలాలకు పట్టణాలకు ఇన్చార్జిలుగా నియమించుటకై పెబ్బేరు పట్టణ మండలానికి సంబంధించిన జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి రాఘవేంద్ర గౌడ్ ను పెద్దమందడి మండలానికి జిల్లా కౌన్సిల్ మెంబర్ సురగౌని రంగస్వామి గౌడ్ ను వనపర్తి మండలానికి జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు ను శ్రీరంగాపురం మండలానికి ఇన్ ఛార్జ్ లుగా నియమించడం జరిగింది
ఈ బాధ్యతలను స్వీకరించి పార్టీ బలోపేతానికి



కృషి చేస్తున్నందుకు పెబ్బేరు పట్టణ శాఖ తరపున సన్మానం చేశారు పెబ్బేరు పట్టణానికి నూతన ఇన్చార్జి గా వచ్చిన కొమ్ము శ్రీనివాస్ గారికి సన్మానం చేయడం జరిగినది

# నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ ఛార్జ్‌షీట్

**⏭ విస్తుపోయే నిజాలు వెలుగులోకి!**

**టీ మీడియా, ఆగస్టు 7 , ఢిల్లీ బ్యూరో :**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీబీఐ ముమ్మర దర్యాప్తు జరపగా ఛార్జ్‌షీట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పలువురు ఎన్‌టీఏ నిపుణులు, మధ్యవర్తులు ఒక వ్యవస్థీకృత ముఠాగా ఏర్పడి ఈ రాకెట్‌ను నడిపించారని కేంద్ర దర్యాప్తు సంస్థ నిరూపించింది. పుణేలోని ఒక నివాస సముదాయానికి చెందిన యాక్సెస్ కంట్రోల్ యాప్, మొబైల్ ఫోన్ లొకేషన్లు, బయోమెట్రిక్ రికార్డుల ఆధారంగా ఈ కేసులో 13 మంది నిందితులపై సీబీఐ ప్రత్యేక కోర్టులో 94 పేజీల చార్జ్‌షీట్ దాఖలు చేసింది.
ప్రవేశ పరీక్ష తయారీలో భాగమైన మూడు సబ్జెక్టుల నిపుణులు ప్రశ్నలను ఎలా లీక్ చేశారో సీబీఐ వివరించింది. పీవీ కులకర్ణి, మనీషా మాందరే, మనీషా హవల్దార్ ఈ లీకేజీ వెనక ప్రధాన కారకులని పేర్కొంది. వీరు ప్రశ్నలను గుర్తుపెట్టుకోవడం, చీటీలపై రాసుకోవడం, పుస్తకాల్లో సంబంధిత పేరాలను మార్క్ చేయడం వంటి పద్ధతులను నిందితులు అనుసరించారని వివరించింది. కులకర్ణి కెమిస్ట్రీ నిపుణుడు కాగా మిగతా ఇద్దరు బోటనీ, ఫిజిక్స్‌లో నిపుణులు. అరెస్టయిన 13 మందిలో వీరు కూడా ఉన్నారు. ఎన్‌టీఏ కేంద్రంలో ప్రశ్నల రూపకల్పన, అనువాదం చేస్తున్న సమయంలో వివిధ విభాగాల్లోకి నిపుణులకు ప్రవేశం ఉండేదని సీబీఐ ఛార్జిషీట్‌లో చెప్పింది. అప్పుడే వారు చీటీలపై ప్రశ్నలను రాసుకుని, పుస్తకాల్లో పేరాలను మార్క్ చేసుకునేవారని తెలిపింది. భారీ మొత్తంలో డబ్బు కోసం ఎన్‌టీఏలోని భద్రతా లోపాలను వాడుకున్నారని ఆరోపించింది. హవల్దార్, మాంధరేలు కూడా తమ జ్ఞాపకశక్తి ఆధారంగా ప్రశ్నలను హోటల్ గదుల్లోని సబ్జెక్ట్ పుస్తకాలపై నోట్ చేసుకున్నారని తెలిపింది.




ఎన్‌టీఏ నిబంధనలను ఉల్లంఘించి పరీక్షకు ముందు వీరు పుణేలో కోచింగ్ క్లాసులు నిర్వహించారని పేర్కొంది.
అనంతరం తమ నెట్‌వర్క్‌లో భాగమైన మధ్యవర్తులు, కోచింగ్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు ఆ ప్రశ్నలను చేరవేశారనే సీబీఐ అభియోగాలు మోపింది. తమ మోసం బయటపడకుండా ఉండేందుకు డిజిటల్ మార్గాలను ఉపయోగించకుండా, ఈ పద్ధతిని ఎంచుకున్నారని సీబీఐ అధికారులు భావిస్తున్నారు. ఆర్థిక లబ్ధితో పాటు కోచింగ్ సెంటర్ల విజయశాతాలను పెంచేందుకే ఈ కుట్ర పన్నారని తెలిపారు.
మనీషా సంజయ్ వాఘ్మారే అనే బ్యూటీషియన్ ఈ కేసులో కీలక మధ్యవర్తిగా వ్యవహరించినట్లు సీబీఐ వెల్లడించింది. ఈమె కొంతమంది విద్యార్థులను ఈ నిపుణుల క్లాసుల్లో చేర్పించి, వారు ప్రశ్నలను రాసుకున్న నోట్‌బుక్స్‌ను సేకరించి రాజస్థాన్, హరియాణా వంటి రాష్ట్రాల్లోని అభ్యర్థులకు లీక్ చేసినట్లు ఆరోపించింది. అలాగే, మాంధరే సూచన మేరకు ఫిజిక్స్ నిపుణురాలు హవల్దార్ ఒక విద్యార్థి తల్లికి 68 ప్రశ్నలతో కూడిన 16 పేజీల మెటీరియల్‌ను అందించినట్లు పేర్కొంది.
చేతిరాతతో ఉన్న కొన్ని నోట్స్‌ను దర్యాప్తులో భాగంగా సీబీఐ స్వాధీనం చేసుకుంది. అలాగే ఎన్‌టీఏ అనుసరిస్తోన్న నిబంధనల్లో లోపాలను సీబీఐ ఎత్తిచూపింది. చీఫాలో పేపర్ సెట్టింగ్‌లో కీలకమైన ప్రాంతంలోకి వెళ్లేటప్పుడు, అక్కడి నుంచి వచ్చేటప్పుడు నిపుణులను తనిఖీ చేసే పద్ధతి లేదని చెప్పింది. పేపర్ తయారీ ప్రక్రియలో భాగమైన నిపుణులకు ఆ ప్రశ్నలు సులభంగా గుర్తుంటాయి. కులకర్ణి మూడు సెట్ల పరీక్షపత్రాల నుంచి మూడురోజుల్లో 135 ప్రశ్నలను అనువాదం చేశారు.
సీబీఐ స్వాధీనం చేసుకున్న లీక్?డ్? మెటీరియల్‌ను పరిశీలించిన దిల్లీ యూనివర్సిటీ నిపుణుల కమిటీ, నీట్– యూజీ 2026కి సంబంధించిన నాలుగు సెట్ల పేపర్లు (కైలాష్, శివాలిక్, సెట్ 2, సెట్ 3) తో స్పష్టంగా సరిపోలిందని తేల్చిందని వివరించింది. ముఖ్యంగా నిందితులైన ఎన్‌టీఏ నిపుణులకు ఏ ప్రశ్నపత్రాలపై యాక్సెస్ ఉందో, ఆ సెట్లలోని ప్రశ్నలు లీక్ అయిన మెటీరియల్‌తో గరిష్ఠంగా 85 శాతం వరకు ఏకీభవించినట్లు సీబీఐ తన చార్జ్‌షీట్‌లో పేర్కొంది.

# క్షతగాత్రుడికి ఎంపీ రఘురాంరెడ్డి చేయూత

**⏭ చేతి శస్త్రచికిత్సకు రూ.75 వేల ఎల్ఓసీ మంజూరు**

**⏭ చొరవ చూపిన కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు**

**టీ మీడియా,ఆగస్ట్07,సింగరేణి(కారేపల్లి):**
ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సింగరేణి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన సూరపాక కృష్ణకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అండగా నిలిచారు.చేతికి శస్త్రచికిత్స అవసరమైన నేపథ్యంలో రూ.75 వేల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించడంతో బాధిత కుటుంబానికి ఊరట లభించింది.పోలంపల్లి గ్రామానికి చెందిన సూరపాక కృష్ణ ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు.చేతికి తీవ్ర గాయం కావడంతో శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం



ఏర్పడింది.చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్న విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.విషయం తెలుసుకున్న ఎంపీ వెంటనే స్పందించి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌తో మాట్లాడారు.కృష్ణకు అవసరమైన శస్త్రచికిత్స అందేలా రూ.75 వేల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించారు.మంజూరైన ఎల్ఓసీ కాపీని కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావు బాధితుడు సూరపాక కృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు.చికిత్స విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని,అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటామని భరోసా ఇచ్చారు.తమ కుటుంబం కష్ట సమయంలో ఉన్న విషయాన్ని తెలుసుకొని వెంటనే స్పందించి వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా కల్పించిన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డికి సూరపాక కృష్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.తమ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి ఎల్ఓసీ మంజూరుకు సహకరించిన కాంగ్రెస్ నాయకుడు మల్లెల నాగేశ్వరరావుకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## పి ఆర్ సి సాధించేవరకు దశల వారి పోరాటం కొనసాగిస్తాం



**⏭ ఉపాధ్యాయ సంఘాల నేత వెంకటేశ్వర్లు వెల్లడి**

**టీ మీడియా, ఆగస్టు 7 కామేపల్లి:**
ఉపాధ్యాయుల పిఆర్సి ప్రకటించే వరకు దశల వారి పోరాటాలు కొనసాగిస్తామని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నేత జి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపుమేరకు శుక్రవారం మండలంలోని కొమ్మినేపల్లి హైస్కూల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.భోజనం విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిఆర్సి సాధన, పెండింగ్ డీఏ ల కొరకు జీవో 25 సవరణ, సిపిఎస్ రద్దు లాంటి డిమాండ్ల సాధన కోసం దశలవారి పోరాటాలు కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బి రవికుమార్ ,వీరభద్రం వి ఎస్ రెడ్డి, టీ కైలాస రావు, ఎస్.కె రంజాన్, హెచ్ఎం పి జ్యోతి, భవాని, కవిత, అరుణ, జ్యోతి, రమ ప్రభ, విజయ కుమారి, ఉష తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నా మీకోసం ప్రారంభంచిన జమాల్ ఖాన్




**టీ.మీడియా.ఆగస్టు7.చింతూరు**
రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని చింతూరు మండల తెలుగుదేశం అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ వేగితోట గ్రామం లో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలు రైతుల వద్దకు వెళ్ళి తమ పథకాలు గురించి వివరించారు ఈ కార్యక్రమంలోమండల వ్యవసాయాధికారి రత్న ప్రభ,మండల టీడీపీ అధ్యక్షులు జమాల్ ఖాన్,మార్కెట్ కమిటీ సభ్యులు సాల్మన్ రాజు,వ్యవసాయ సిబ్బంది శివ శ్రీనువెటర్నరీ సిబ్బంది,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యానికి తల్లిపాలే అమృతం




**⏭ ఈట్యాతండా అంగన్‌వాడీలో ఘనంగా అన్నప్రాసన వేడుక**

**టీ మీడియా,ఆగస్ట్07,సింగరేణి(కారేపల్లి):**
చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని,పుట్టిన బిడ్డకు తల్లిపాలు సహజమైన రక్షణ కవచంగా నిలుస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణ, సర్పంచ్ జయంతి అన్నారు.కారేపల్లి మండలం చీమలపాడు సెక్టార్ పరిధిలోని ఈట్యాతండా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని అన్నప్రాసన వేడుకను ఘనంగా నిర్వహించారు.చిన్నారులకు సంప్రదా యబద్ధంగా అన్నప్రాసన నిర్వహించి, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం,తల్లిపాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణ,సర్పంచ్ జయంతి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలలో బిడ్డకు అవసరమైన పోషకాలు ఉండటంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే అందించడం ఎంతో ముఖ్యమన్నారు.తల్లిపాలు తీసుకునే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి మెరుగుపడి అనేక రకాల అనారోగ్యాల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు.తల్లిపాలు బిడ్డ శారీరక,మానసిక ఎదుగుదలకు దోహదపడటంతో పాటు తల్లీబిడ్డల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఆరు నెలలు పూర్తయిన తర్వాత చిన్నారుల వయస్సుకు అనుగుణంగా పౌష్టికమైన అనుబంధ ఆహారాన్ని అందిస్తూ తల్లిపాలను కొనసాగించాలని సూచించారు.చిన్నారులకు తాజా,పరిశుభ్రమైన,పోషక విలువలున్న ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బాటలు వేయవచ్చన్నారు.నవజాత శిశువులకు తేనె,నీళ్లు లేదా ఇతర పదార్థాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు.పిల్లల పోషణ,ఆరోగ్యం విషయంలో తల్లులు అంగన్‌వాడీ,వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలని కోరారు.ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు,బాలింతలు,చిన్నారుల ఆరోగ్యం,పౌష్టికాహారంపై అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బి.మోహన్,అంగన్‌వాడీ టీచర్లు బి.నగ్మా,బి.శారద, వి.బిందు,వి.శ్రీలక్ష్మి,ఆశా వర్కర్ జి.అచ్చమ్మ,గ్రామ పెద్దలు,తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేతకు 50 ఏళ్లకే పింఛన్

(మొదటి పేజీ తరువాయి)
గుర్తింపు తీసుకొచ్చారు. 1.27లక్షల మంది ఈ రంగంపైనే ఆధారపడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు టీడీపీకే ఓటు వేశారు. సబ్సిడీపై చేనేతలకు విద్యుత్ ఇస్తామన్నాం, మాట నిలబెట్టుకున్నాం.
చేనేతలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తున్నాం. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నాం. చేనేతలకు రూ.25 వేలు ఇస్తున్నాం. అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు ఇచ్చాం. ఎన్డీయే ప్రభుత్వం బీసీలకు రుణపడి ఉంది. తప్పకుండా మీ రుణం తీర్చుకుంటాం. సంజీవని పేరుతో రూ.2.50 లక్షల ఆరోగ్య బీమా ఇస్తున్నాం. ఎవరికీ ఇబ్బంది లేని పరిపాలన అందిస్తామని హామీ ఇచ్చాం. రెండేళ్లలో మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

**చిన్న ఎయిర్‌పోర్టు కడితే ప్రపంచం అంతా అక్కడికే**

"సూర్యలంక, బాపట్ల, చీరాలలో బెస్ట్ బీచ్‌లు ఉన్నాయి. శనివారం, ఆదివారం వస్తే హైదరాబాద్ నుంచి ఇక్కడి బీచ్‌లకే వస్తారు. మరో గోవా ఎక్కడో లేదు, చీరాల, సూర్యలంక మధ్యలో ఉంది. చీరాల పక్కన చిన్న ఎయిర్‌పోర్టు కడితే ప్రపంచం అంతా ఇక్కడికే రావాలి. రెండేళ్లలో సంక్షేమం కోసం రూ.లక్షా 50 వేలు ఖర్చు చేశాం. అభివృద్ధికి రూ.లక్షా 30 వేలు ఖర్చు చేశాం. ఒకప్పుడు పిల్లలంటే భారం, ఇప్పుడు పిల్లలంటే సంపద. రెండేళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయి.

# రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం



**▶▶|వెంటనే స్పందించిన సర్పంచ్ సుజాత సంతోష్**

**▶▶|చెట్టు తొలగింపుతో వాహనదారులకు ఊరట**

**టీ మీడియా,ఆగస్ట్07,సింగరేణి(కారేపల్లి):**
గురువారం రాత్రి కురిసిన వర్షం, ఈదురుగాలుల కారణంగా తిమ్మారావుపేట-- చీమలపాడు ఆర్అండ్బీ రహదారిపై భారీ వృక్షం కూలి శుక్రవారం ఉదయం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.విషయం తెలుసుకున్న పాటిమీదగుంపు గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ సుజాత సంతోష్ వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని చెట్టు తొలగింపు చర్యలు చేపట్టారు.గురువారం రాత్రి కురిసిన వర్షానికి తోడు బలమైన గాలులు వీయడంతో తిమ్మారావుపేట నుంచి చీమలపాడు వెళ్లే ప్రధాన ఆర్అండ్బీ రహదారికి అడ్డంగా భారీ వృక్షం కూలిపోయింది.దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు,స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ విషయం సర్పంచ్ గుగులోత్ సుజాత సంతోష్ దృష్టికి రావడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు.స్థానిక ప్రజలు,యువకులు,ప్రజాప్రతినిధుల సహకారంతో రహదారికి అడ్డంగా పడిన చెట్టును తొలగించే పనులు చేపట్టారు.చెట్టు కొమ్మలను తొలగించి రహదారిని శుభ్రం చేయడంతో తిరిగి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.ప్రజలకు,వాహనదారులకు ఇబ్బంది కలగకుండా సమస్య తెలిసిన వెంటనే స్పందించి రహదారిని క్లియర్ చేయించిన సర్పంచ్ సుజాత సంతోష్ను స్థానికులు అభినందించారు.వర్షాకాలంలో రహదారులపై చెట్లు కూలడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఈసం రమేష్,ఎన్.కె.జాను,వంశీకృష్ణ,డీవైఎఫ్ఐ యువకులు ధరావత్ వినోద్కుమార్, శివ, సుధాకర్తో పాటు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 'పుష్ప'రాజ్ను మించిపోతున్న దళారులు



**▶▶|యథేచ్ఛగా అల్లిచెట్ల అక్రమరవాణా**

**టీ మీడియా, ఆగస్టు 7 , హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ-ఛత్తీస్గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో అల్లిచెట్ల కలప అక్రమ రవాణా దందా విచ్చలవిడిగా సాగుతోంది. పొరుగురాష్ట్రం నుంచి విచ్చలవిడిగా ఈ చెట్టు కొమ్మలు, దుంగలను ఇక్కడకు తరలిస్తున్నారు. వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దులో అటవీశాఖ నిఘా కొరవడటంతో అక్రమ దందా నిత్యకృత్యంగా మారింది.
చర్ల, దుమ్ముగూడెం మీదుగా తరలింపు బీజాపూర్, దంతెవాడ, సుక్మా తదితర జిల్లాల్లో దండకారణ్యం నుంచి కొంతమంది దళారులు ఆదివాసీల వద్ద అల్లి చెట్టు కలపను సేకరించి చర్ల, దుమ్ముగూడెం మీదుగా భద్రాచలం నుంచి హైదరాబాద్?, విజయవాడ, చెన్నై తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఛత్తీస్?గఢ్ రాష్ట్రంలో దీని విక్రయాలను అక్కడి సర్కారు నిషేధించింది. మావోల కార్యకలాపాలు తక్కడంతో కొంతమంది వ్యాపారులు దళారులను పెట్టి పెద్దఎత్తున అల్లి కలప సేకరణ చేయిస్తూ అటవీ అధికారుల కళ్లుగప్పి సరిహద్దు దాటించేస్తున్నారు.
నిఘా పెడితేనే అక్రమరవాణాకు అడ్డుకట్ట ఛత్తీస్గఢ్లోని సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల నుంచి తెలంగాణలోని చర్ల మండల శివారులోని అటవీ ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా కలపను తరలిస్తున్నారు. సరిహద్దు గ్రామాలకు చేరుకున్న దీన్ని బొలేరో లాంటి వాహనాల్లో ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నారు.
అక్రమ సరఫరాకు ఈ ప్రాంతంలో కొంతమంది సంత వ్యాపారులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మన ప్రాంతం నుంచి జరిగే అల్లి చెట్ల అక్రమ రవాణాపై ఫారెస్ట్? అధికారులు నిఘా పెడితే కళ్లెం వేయొచ్చు. దీని బెరడు, వేర్లు ఆయుర్వేద ఔషధాలు, చక్కెర వ్యాధిని తగ్గించే మందుల తయారీలో ఉపయోగిస్తారు. ఆదివాసీల నుంచి కిలో రూ.60, రూ.70లకు కొనుగోలు చేసి వ్యాపారులు నేరుగా నగరాలకు రవాణా చేసి కిలోకు రూ.100 నుంచి రూ.110కు అమ్ముతున్నట్లుగా తెలుస్తోంది.
హద్దులు దాటిన అక్రమ రవాణా అల్లిచెట్టు కలప అక్రమ రవాణా చేసి లాభాలు ఆర్జించేందుకు వ్యాపారులు దళారులను పావులుగా వాడుకుంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా రాష్ట్రాల సరిహద్దులను దాటించేస్తున్నారు. కలప అక్రమ రవాణా ద్వారా రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఇలాంటి వారిపై అటవీశాఖ అధికారులు దృష్టిసారించి కఠిన చర్యలు చేపట్టాల్సి ఉంది. అప్పుడు మాత్రమే ఈ అక్రమ దందాకు చెక్? పడే అవకాశం ఉంటుంది. అయితే ఇదే విషయంపై సంబంధిత అటవీ అధికారులను వివరణ కోరగా అక్రమ రవాణాపై నిఘా పెట్టామని తెలిపారు. తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని వివరించారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ..



**▶▶|శిలాతోరణం వరకు క్యూలైన్లో భక్తులు**

**టీ మీడియా, ఆగస్టు 7 , తిరుమల :**
భక్తవత్సల గోవిందా.. భాగవత ప్రియ గోవిందుడు కొలువుదీరిన తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్లో నిలబడ్డారు. గురువారం స్వామివారిని 66,842 మంది భక్తులు దర్శించుకోగా 28,670 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 4.27 కోట్ల ఆదాయం వచ్చింద న్నారు. టోకెన్లు లేని భక్తులకు 20 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. 4.53 లక్షల లడ్డూలను విక్రయించామని, 2.77 లక్షల మందికి అన్న ప్రసాదం అందజేసామన్నారు.

# ఆదివాసి దినోత్సవం ఘనంగా జరుపుదాం

**▶▶|ఐ టి డి ఏ పి ఓ**

**టీ.మీడియా,ఆగస్టు7,చింతూరు:**
ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఐ.టి.డి.ఎ., చింతూరు సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఆదివాసి సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించినట్లు ఐ.టి.డి.ఎ., చింతూరు ప్రాజెక్టు అధికారి శుభం నోఖ్వాల్, తెలిపారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, 09న చింతూరులోని ఏ.పీ.టి.డబ్ల్యూ.ఆర్. పాఠశాల మైదానంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఆదివాసి సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు,



విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వేదిక, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వేడుకల నిర్వహణలో భాగంగా వివిధ శాఖలకు బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా, ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ నృత్యాలు, మరియు ఇతర కార్యక్రమాలలో ఆదివాసి ప్రజలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఐ.టి.డి.ఎ. పరిధిలోని వివిధ శాఖల అధికారులు, ఆదివాసి నాయకులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీకి కేంద్రం తూట్లు

**▶▶| పేదల హక్కుల కోసం పోరుబాట పట్టాలి**

**▶▶|ఆగస్టు 10 జైల్ భరోను జయప్రదం చేయాలి**

**▶▶|వృకాస జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగేశ్వరరావు**



**టీ మీడియా,ఆగస్ట్07,సింగరేణి(కారేపల్లి):**
గ్రామీణ పేదలకు జీవనాధారంగా ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బలహీనపరుస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. పేదలు, కార్మికులు, రైతులు సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా కార్మిక, కర్షక,రైతు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కారేపల్లిలో ప్రచారం నిర్వహించారు.ప్రజలను కలిసి జైల్ భరోలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతులు,వ్యవసాయ కార్మికులు, కార్మికులకు నష్టం కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు. వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపే విధానాలను అమలు చేస్తూ రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టం చేసి,అవసరమైన నిధులు కేటాయించి ఎక్కువ పనిదినాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.అందుకు విరుద్ధంగా ఉపాధి హామీని బలహీనపరిచే చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు.దీనివల్ల గ్రామీణ పేదలు ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలతో ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు.పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరతతో సామాన్య,పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నాగేశ్వరరావు అన్నారు.రైతులు,వ్యవసాయ కార్మికులు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత భారాలు మోపే విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు.
క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని ప్రజా నిరసన వేదికగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు గ్రామీణ పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను, పోరాట స్ఫూర్తిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కె. నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కేసగాని ఉపేందర్, ఎనమనగండ్ల రవి, ముండ్ల ఏకాంబరం, పాసిని నాగేశ్వరరావు, నాగమణి, కమల, రాధ, హుస్సేన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రసాబసాగా పాలేరు గ్రామసభ

**టీ మీడియా ,ఆగస్టు 7, కూసుమంచి:**
నియోజక వర్గ కేంద్రం పాలేరులో శుక్రవారం జరిగిన పాలేరు గ్రామపంచాయతీ సభ రసాబసాగా జరిగింది. తొలుత గ్రామసభని ప్రారంభిస్తూ సర్పంచ్ బానోతు నాగేశ్వరరావు మాట్లాడుతుండగా మధ్యలో కల్పించుకొని ఒక్కసారిగా వార్డు సభ్యులు అడ్డు తగిలారు. అసలు పేరుకే గ్రామసభ జరిగినట్లు, గ్రామపంచాయతీలో ఏం జరుగుతుందో, పంచాయతీకి రాబడి ఖర్చు ఎంతో కనీసం వార్డు సభ్యులకు కూడా తెలియకపోవడం అయోమయంగా ఉందని వార్డు సభ్యులు గోపే రాము , ఘాటుగా ఆరోపించారు. ఇటీవల గ్రామంలో వీధి కుక్కల పట్టించడం, వాటి రవాణా ఖర్చు, అలాగే గ్రామ వీధుల్లో గ్రావెల్ తోల కం ఖర్చు ఎంత అయిందో ఇప్పటివరకు వార్డు సభ్యులు ఎవరికీ చెప్పకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. పంచాయతీలో జరుగుతున్న విషయాలను తమకు తెలుపకుండా సర్పంచికి అనుకూలంగా ఉండే 7, 8 మంది వార్డు సభ్యులతో సంతకాలు పెట్టించుకుని, తమ సంతకాలు అవసరం లేనట్లుగా విషయం కూడా తెలుపకుండా పట్టించుకోవడంలేదని ఆయన తీవ్రంగా ఆరోపించారు. సభ్యులతో సంతకాలు పెట్టించుకుని గ్రామపంచాయతీ తీర్మానం నోట్స్ లో విషయము ఏమిటో రాయకుండా, నగదు ఖర్చు ఎంతో తెలుపకుండా, ఖాళీ కాగితాలపై వార్డు సభ్యులతో సంతకాలు పెట్టించారని, అయితే సంతకం కోసం తన వద్దకు వస్తే వ్యతిరేకించి, సంతకం పెట్టకుండా తిరస్కరించానని, సభాముఖంగా వార్డు సభ్యులు గోపి రాము సవివరంగా చెప్పారు. ఇప్పటివరకు జరిగిన గ్రామపంచాయతీ పనితీరుపై విచారణ చేయాలని రాము అధికారులను కోరారు.



సర్పంచి నాగేశ్వరరావు అందుకు సమాధానం ఇస్తూ అలాంటిది ఎప్పుడు జరగలేదని, అది పూర్తి అవాస్తవ ఆరోపణ మాత్రమేనని ఆయన తోషిపుచ్చారు. ఇదంతా జరుగుతున్న క్రమంలో గ్రామస్తులు దాసరి వెంకన్న ,కందుల బాబు ,కొత్త పుల్లారెడ్డి, పాలేరు గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ నూకల హుస్సేను మాట్లాడుతూ గ్రామంలో పాలన పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందని ఆరోపిస్తూ సభా వేదిక వైపు దూసుకు వెళ్లారు
అసలే వర్షాకాలం సమయం అయినందున దోమల బెడదతో ప్రజలు, ప్రధానంగా చిన్నపిల్లలు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తీవ్ర ఆగ్రహంతో సభా దృష్టికి తీసుకొచ్చారు. 8 నెలల కాలములో ఒక్కసారి మాత్రమే దోమల మందు స్ప్రే చేశారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ , డీజిల్ ,పంచాయతీ సిబ్బంది, సైడ్ రైమ్స్ తవ్వకం మట్టిని ఉపయోగించుకొని , వీధుల్లోకి తోలి బిల్లులు డ్రా చేయడం, అలాగే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకొని సర్పంచి సొమ్ము చేసుకున్నారని గ్రామానికి చెందిన దాసరి వెంకన్న ఆరోపించారు. గ్రామంలో ప్రస్తుతం సుమారు 70 లక్షల నిధుల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్లు ఫ్లైడ్ రైస్ నిర్మాణాలు పూర్తిగా నాణ్యత లోపంతో జరుగుతున్నాయని, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేదని దాసరి కన్నా ఈ సందర్భంగా పేర్కొన్నారు. మొత్తంగా గ్రామసభ సర్పంచి నాగేశ్వరరావు పాలనపై వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తీవ్ర సంతృప్తిని వ్యక్తం చేస్తూ, అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ పాలన తీరు మారాలని, వార్డు సభ్యులు ప్రజలు కోరారు. ఈ గ్రామ సభలో గ్రామ ఉపసర్పంచ్ ఎలిశెట్టి ఉపేందర్, కార్యదర్శి, జిపిఓ, పాలేరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులుగ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# థాయ్లాండ్ స్కూల్లో కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన థాయ్ ప్రధాని**

మరోవైపు, ఈ స్కూల్లో కాల్పుల ఘటనపై థాయ్లాండ్ ప్రధాని అనుటిన్ చార్న్విరాకుల్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలియజేశారు. బాధితులను అన్ని విధాలా అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

**ఫొటోలు, వీడియోలు షేర్ చేయొద్దు**

అలాగే ఈ ఘటనపై థాయ్లాండ్ విద్యాశాఖ మంత్రి ప్రసెర్ట్ చంతరారువాంగ్థాంగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

# ఫ్రై డే డ్రై డే లో పాల్గొన్న చైర్మన్, కమిషనర్



**టీ మీడియా, ఆగస్టు 07 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ లోని 9 వ వార్డు లో ఫ్రై డే- డ్రై డే లో ముఖ్య అతితులుగా పాల్గొన్న చైర్మన్ కమిషనంద

ఈ సందర్భంగా చైర్మెన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మన పరిసరాలు పరి శుభ్రతతోనే వ్యాధులు ప్రబలకుండా నివారనే ముఖ్యం ఆని ఆరోగ్య కరమైన సమాజశీ సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని కాలనీలోని ప్రధాన వీధులు డ్రెయిన్లను ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు వర్షాకాలశీ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తీవ్ర అప్రమత్తతతో ఉంటూ ప్రతి ఒక్కరు శుక్రవారం డ్రై డే గా పాటించి ఇళ్లలోని నీటి తొట్లు కుండలు కూలర్లు పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు కమిషనర్ గణేష్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది ప్రతిరోజూ పారిశుధ్య పనులను పక్కాగా నిర్వహించాలని ఎక్కడా చెత్తాచెదారం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఆశా వర్కర్లు వైద్యాధికారులు ఇంటింటికీ తిరుగుతూ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది దామోదర్ రాజశేఖర్ 9వ వార్డు కాలనీవాసులు సుధాకర్ గౌడ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ యోగేష్ వార్డ్ ఆఫీసర్ ధర్మ తేజ్ ఆశా వర్కర్లు పారిశుధ్య సిబ్బంది స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# శాకాంబరీ దేవి అలంకరణ లో లలితా త్రిపురసుందరీ దేవి



టీ మీడియా, ఆగస్టు 7 పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో కొలువై ఉన్న లలితా త్రిపురసుందరీ దేవి అమ్మవారిని శాకాంబరీ దేవి అలంకరణలో అత్యంత వైభవంగా అలంకరించారు
ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు కుంకుమార్చనలు నిర్వహించి విశేష పూజలు చేశారు అనంతరం పండ్లు కూరగాయలు ఆకుకూరలు పుష్పాలతో శాకాంబరీ దేవి రూపంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు.శాకాంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అత్యవసర కాల్ అందగానే ఆసుపత్రికి తరలించాలి



**టీ మీడియా ,ఆగస్టు 7, ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా ఆత్మకూర్ 108 అంబులెన్సుల ద్వారా ప్రజలకు అత్యుత్తమ నాణ్యమైన వైద్య సేవలను అందించాలని 108 అంబులెన్స్ స్టేట్ ఫ్లీట్ హెడ్ వరప్రసాద్ రాజు సిబ్బందికి సూచించారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్ 108 డ 102 అంబులెన్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్సుల్లో అందుబాటులో ఉన్న వివిధ రకాల వైద్య పరికరాల పనితీరు, మందుల నిల్వ, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న అత్యవసర వైద్య సేవలను పరిశీలించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సహాయం అందేలా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అత్యవసర కాల్ వచ్చిన వెంటనే స్పందించి, క్షతగాత్రులు మరియు రోగులను సకాలంలో సమీపంలోని ఆసుపత్రికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా అంబులెన్సుల వాహనాల కండిషన్ను ఎప్పటికప్పుడు పరి శీలిస్తూ, వాహనాల మెయింటెనెన్స్ను సక్ర మంగా నిర్వహించాలని, ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ రవి, ఎగ్జి క్యూటివ్ రత్నం,దుర్గా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీనివాస్, సంజీవ్ అజీమ్ పాల్గొన్నారు.

# రఫీ ని సన్మానించిన మసీదు సభ్యులు



**టీ మీడియా, ఆగస్టు 7 ,అమరచింత:**
వనపర్తి జిల్లా అమరచింత జామియా మస్జిద్‌లో సాక్షి రఫీక్ కి ఘనంగా సన్మానం చేశారు. పవిత్ర కాబా దర్శించుకొని ఉమ్రా పూర్తి చేసుకొని వచ్చిన రఫీక్ ని జామియా మస్జిద్ సదర్ ఎన్. ఆరిఫ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. సయ్యద్, ఎన్. అయ్యూబ్, ఖయ్యూమ్, డీజే మహిమూద్, ఇమ్రాన్, అల్తాఫ్, సమీర్, కరీం, తాకీ, మైనుద్దీన్, గుల్ అహ్మద్, నయ్యూమ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు
ఈ సందర్భంగా అందరూ రఫీక్ కి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆదర్శ మున్సిపాలిటీగా ఏదులాపురం అభివృద్ధి

- **రూ.100 కోట్ల నిధులు మంజూరు**
- **అవసరాలకు అనుగుణంగా మౌళిక వసతులు**



**టీ మీడియా ఆగస్టు 7,ఖమ్మం రూరల్ :**
ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, సత్యనారాయణపురం, ఇందిరమ్మ కాలనీలలో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్‌తో కలిసి కాలినడకన కాలనీల్లో తిరుగుతూ మంత్రివర్యులు అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పరిస్థితులు, ప్రజా మౌళిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర



అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు.లోతట్టు ప్రాంతాల్లో తుమ్మ చెట్లు పెరగడం, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండడం వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వాటి శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన డ్రైనేజీ నిర్మాణంతో పాటు ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.కొన్ని ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య ఉందని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, దానిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. విద్యుత్ తీగలకు సంబంధించిన సమస్యలను కూడా సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు.కొంతమంది ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం వినతులు అందజేశారని, వాటిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పార్కుల అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని, ఈ నెలాఖరులోగా వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి పనిని నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.సాయిగణేష్ నగర్ లో రోడ్డు వెంట ఉన్న టీ స్టాల్ లో కూర్చుని టీ త్రాగి అనంతరం ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. వర్షం పడుతున్న కాలి నడకన గొడుగు చేత పట్టుకుని తిరిగి పరిసరాలను పరిశీలిస్తూ కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పరిశుభ్రతకు 'మర్కోడు' మోడల్



**టీ మీడియా ,ఆగస్టు 7,ఆళ్లపల్లి :**
మర్కోడు గ్రామ పంచాయతీని ఆదర్శవంతంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సర్పంచ్ సుతారి రమాదేవి, ఉప సర్పంచ్ వగలబోయిన సతీష్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ప్రణాళికను అమలులోకి తెచ్చింది.ట్రాక్టర్‌లో ప్రత్యేక వర్గీకరణ డ్రమ్ములుగ్రామస్తుల నుంచి సేకరించే వ్యర్థాలను పద్ధతి ప్రకారం వేరుచేసేందుకు వీలుగా చెత్త సేకరణ ట్రాక్టర్‌లోనే వివిధ రంగుల డ్రమ్ములను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.వంటింటి వ్యర్థాలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలు, కూరగాయలు మరియు పండ్ల తొక్కల సేకరణకు ఒక డ్రమ్ము వాడిపడేసిన కవర్లు, సీసాలు, పేపర్లు వంటి పునరుత్పత్తికి పనికొచ్చే పొడి వ్యర్థాల కోసం.ఇంట్లో విరిగిపోయిన గాజు పాత్రలు, పగిలిన సీసాలు, పదునైన వస్తువులను వేరుగా ఉంచేందుకు ప్రత్యేక డ్రమ్ము.
ముందస్తు చర్యలు
ఈ సందర్భంగా సర్పంచ్ సుతారి రమాదేవి, ఉప సర్పంచ్ వగలబోయిన సతీష్ మాట్లాడుతూ... "పరిశుభ్రత లోపిస్తే గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ఇళ్ల వద్దే చెత్తను తడి, పొడి, ప్లాస్టిక్, గాజు వ్యర్థాలుగా వేరు చేసి ఇవ్వడం వల్ల పంచాయతీ సిబ్బందికి రీసైక్లింగ్ (పునరుత్పత్తి) ప్రక్రియ సులువవుతుంది. చెత్తను రోడ్లపై లేదా ఖాళీ స్థలాల్లో పారవేయకుండా అందరూ ఈ డ్రమ్ముల విధానాన్ని ఉపయోగించాలి" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపడానికి గ్రామస్థుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ ఉదయమే వీధుల్లో తిరుగుతూ ఈ డ్రమ్ముల ద్వారానే వ్యర్థాలను సేకరిస్తారని, ప్రజలందరూ ఈ పద్ధతిని తప్పక పాటించి మర్కోడును రోగరహిత, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని సర్పంచ్, ఉప సర్పంచ్ కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామ పురప్రముఖులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కళ్ళ ముందు కనిపిస్తుంది



**టీ మీడియా ,ఆగస్టు 7 ,అమరచింత:**
వనపర్తి జిల్లా అమరచింత మండలంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 62 చెక్కులు పంపిణీ చేసిన రాష్ట్ర కల్లు గీత చైర్మన్ నాగరాజ్ గౌడ్ మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి ,వైస్ చైర్మన్ రాధా అరుణ్ కుమార్ తాసిల్దార్ రవికుమార్ మున్సిపల్ కమిషనర్ రూరల్ అభి మున్సిపల్ కౌన్సిలర్లు కో ఆప్షన్లు మండల సర్పంచులు పాల్గొన్నారు . నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ అమర్ చింత మండలంలో 300కు పైగా ఇందిరమ్మ ఇల్లు పూర్తయ్యాయని, మరిచింత మండల అధికారులు ఇంకా బీదవారిని గుర్తించి వారికి కూడా ఇండ్లు ఇవ్వన్నారని, మన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రి కావడం మన అదృష్టం . త్వరలో అమర్చింతకు మల్టీప్లెక్స్ కాంప్లెక్స్ భవన నిర్మాణం చేసుకుంటామని , ఏం పిడిఓ ఆఫీస్ నిర్మాణానికి హెచ్డిఎఫ్ ఫండ్ నుంచి 15 లక్షలు పెట్టి నిర్మించామని ఆయన అన్నారు.

# అంబులెన్స్ అందుబాటులో లేక గిరిజన బాలిక మృతి



**టీ.మీడియా,ఆగస్టు7,చింతూరు:**
అంబులెన్స్ అందుబాటులో లేక గిరిజన బాలిక మృతి చెందిన విషయం ఇది. వివరాల్లోకి వెళితే పెద్ద సీతనపల్లి గ్రామానికి చెందిన సోడి పాపయ్య కుమార్తె లాస్య (4)కు మలేరియా జ్వరం తగిలింది. జ్వరం తగిలిన లాస్యను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ప్రాథమిక చికిత్సలు చేశారు. మెరుగైన చికిత్స కోసం భద్రాచలం రిఫర్ చేయగా అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో, అంబులెన్స్ ను సంప్రదించగా డీజిల్ పోసుకోండి డీజిల్ పోసుకుంటే నేను తీసుకువెళ్తాను భద్రాచలం అని డ్రైవర్ చెప్పాడు డీజిలకు డబ్బులు లేక, ప్రైవేటు వాహనాలతో భద్రాచలం తీసుకెళ్లే స్తోమత లేకపోవడంతో లాస్య మృతి చెందింది.
ఐటీడీఏ పి ఓ ఆఫీస్ ముందు ధర్నా.
పెద్ద సీతనపల్లి గ్రామ గిరిజన బాలిక అంబులెన్స్ అందు బాటులో లేక మృతి చెందటం పట్ల బిజెపి జిల్లా కార్యదర్శి డి వి యస్ రమణా రెడ్డి ఆధ్వర్యంలో చింతూరు ఐ టీ డి ఎ ముందు లాస్య మృత దేహం తో ధర్నా నిర్వహించారు. మృతి చెందిన బాలిక విషయం పై సమగ్ర విచారణ చేయాలని, బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని , అలాగే చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ లు 24 గంటలు అందుబాటులో ఉంచాలని ధర్నా నిర్వహించారు. ఐ టీ డి ఎ అంబులెన్స్ కు ఐటిడిఏ పి ఓ డిజిల్ కొరత లేకుండా చూడాలని బిజెపి జిల్లా కార్యదర్శి డి వి యస్ రమణారెడ్డి పి ఓ శుభం నౌక్వాల్ కువివరించారు.